సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 4 । జూన్ । 2023



నవజాత శిశువులకు మెరుగైన సేవలు 10లో

శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.



నాటు సారా ధ్వంసం 10లో

జి.మాడుగుల మండలంలో స్వాధీనం చేసుకున్న 55 లీటర్ల నాటు సారాను పాడేరు ఏఎస్పీ ధీరజ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా లక్ష్మి

రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. 10లో

న్యూస్‌రీల్

రైలు ప్రమాదం బాధాకరం

● చలించిపోయిన జిల్లా ప్రజాప్రతినిధులు

సాక్షి, పాడేరు: ఒడిశాలోని రైలు ప్రమాద ఘటనలో భారీగా ప్రయాణికులు మృతిచెందడం, వందలాది మంది తీవ్రగాయాల పాలైన ఘటన బాధాకరమని జిల్లాలోని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి చలించిపోయారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

ఒకే ఒక్క విద్యార్థి

● ఐదుగురిలో పరీక్షకు నలుగురు గైర్హాజరు

రాజవొమ్మంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రంలో శనివారం విశేషం చోటుచేసుకుంది. ఈ కేంద్రంలో హిందీ పరీక్ష ఐదుగురు విద్యార్థులు రాయాల్సి ఉంది. వీరిలో ఒక్కరు మాత్రమే రాశారు. మిగతా నలుగురు గైర్హాజరయ్యారు. అయితే పరీక్షల నిర్వహణలో భాగంగా ఇరువురు ఇన్విజిలేటర్లు, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, ఇరువురు పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఏఎన్ఎం, చీఫ్ సూపరింటెండెంట్, ఎంఈవో తదితరులు విధులు నిర్వహించారు.

రంపచోడవరం ఏజెన్సీ డీఈవోగా మల్లేశ్వరరావు



గంగవరం : రంపచోడవరం ఏజెన్సీ డీఈవోగా గంగవరం మండల విద్యాశాఖాధికారి వై.మల్లేశ్వరరావును నియమిస్తూ రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే గంగవరం రెగ్యులర్ ఎంఈవోగా ఉన్న మల్లేశ్వరరావు అడ్డతీగల, దేవీపట్నం మండల విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాడు–నేడు, విద్యా ప్రగతి విషయాల్లో మల్లేశ్వరరావు అందిస్తున్న సేవలను ఐటీడీఏ పీవో గుర్తించి ఏజెన్సీ డీఈవోగా నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావుకు తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, ఆర్ఐ జిలానీ, యూటీఎఫ్ నాయకులు కృష్ణ, రఘుబాబు, రాంబాబు, తదితరులు అభినందనలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అడ్డతీగల: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా మెయిన్ రోడ్ ఆనుకుని ఉన్న షాపుల వద్ద శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులు, గ్రామ పంచాయతీ అధికారులకు స్థానికులు తెలిపారు. ఎండవేడిమికి తాళలేక వడదెబ్బకు గురై మృతి చెంది ఉండవచ్చని వరాఉ భావిస్తున్నారు. ఎరుపు రంగులో 60 ఏళ్ల వయసు పైబడి ఉన్న ఆ వ్యక్తి షర్టు, నిక్కరు ధరించి ఉన్నట్టు స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు మృతుని వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

ట్రాలర్‌పై బోట్ల తరలింపు



ట్రాలర్‌పై తరలిస్తున్న బోట్లు

సీలేరు: సాధారణంగా మనం నదుల్లో, సముద్రాల్లో బోటులను చూస్తుంటాం. అయితే శనివారం ఉదయం సీలేరులోని ట్రాలర్‌పై బోట్లను పలువురు ఆసక్తిగా తిలకించారు. ఒడిశాలోని చిత్రకొండ ఈసీవో పార్కు వద్ద పర్యాటకుల సౌకర్యార్థం బోటు షికారు ఏర్పాటుచేశారు. ఇక్కడి బోట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వీటి స్థానంలో ఏర్పాటుకు గుజరాత్ నుంచి సీలేరు మీదుగా ఒడిశా చిత్రకొండ పార్కుకు ట్రాలర్‌పై బోట్లను తరలించారు.

అడవి.. దారిచ్చింది!



రోడ్డు వేయక ముందు రహదారి పరిస్థితి



యు.చీడిపాలెం-యర్రగొండ మధ్య నిర్మించిన మట్టిరోడ్డు

కొండల్లో ఉన్న ఆ తొమ్మిది గ్రామాల గిరిజనులకు రవాణా సౌకర్యం లేదు. ప్రాణం మీదకొస్తే ఆ దేవుడినే ప్రార్థించాలి. అటవీమార్గంలో ఆస్పత్రికి తీసుకువెళ్లే వరకు వారి మొర ఆలకిస్తే ప్రాణం నిలుస్తుంది. లేదంటే ఊపిరి ఆగుతుంది. ఇలా ఆయా గ్రామాల గిరిజనులు దశాబ్దాల తరబడి నరకం చూస్తున్నారు. గతంలో అధికారులు, నేతలకు తమ సమస్యను చెప్పి విసిగిపోయారు. వీరి సమస్యపై ప్రస్తుత ప్రభుత్వం స్పందించింది. అటవీ ప్రాంతంలో మట్టిరోడ్డు నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవతో ఉపాధి నిధులతో 12 కిలోమీటర్ల మట్టిరోడ్డు రూపుదిద్దుకుంది. సమస్య పరిష్కారమైంది.

- ● అటవీశాఖ ఆమోదంతో యు.చీడిపాలెం- యర్రగొండకు మట్టిరోడ్డు
- ● 12 కిలోమీటర్ల పొడవున నిర్మాణం
- ● బీటీ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు
- ● కొండల్లోని తొమ్మిది గ్రామాలకు ప్రయోజనం
- ● కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవతో సమస్య పరిష్కారం

కొయ్యూరు: మండలంలోని యు.చీడిపాలెం నుంచి యర్రగొండతో పాటు మరో ఏడు గ్రామాలకు వెళ్లాలంటే 12 కిలోమీటర్ల పొడవునా దట్టమైన అడవిని దాటాలి. వర్షాకాలంలో వెళ్లేందుకు వీలుపడదు. పేపర్‌మిల్లు వాహనాలు వెదురు తోలేందుకు వేసిన మార్గం తప్ప మరొకటి లేదు.

మావోయిస్టుల అభ్యంతరంతో..

వీరవరం– మర్రిపాకల రోడ్డు నిర్మాణానికి 2004లో పీఎంజీఎస్‌వైలో రూ. 1.60 కోట్లు మంజూరయ్యాయి. మావోయిస్టుల అభ్యంతరంతో అప్పటిలో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దాదాపుగా అప్పటినుంచి రోడ్డు వేసేందుకు ప్రయత్నించినా టేకు ప్లాంటేషన్ కారణంగా అటవీ శాఖనుంచి అనుమతులు రాలేదు. ఈ మార్గంపై నీలవరం, గంగవరం, యర్రగొండ, తీగలమెట్ట, మర్రిపాకలు, జెర్రిగొంది, పాలసముద్రం గ్రామాల గిరిజనులు ఆధారపడ్డారు. వీరంతా రోడ్డుకు అడ్డంకిగా మారిన టేకు ప్లాంటేషన్ కొంతమేర తొలగించడం సంచలనమైంది. ఈ పరిస్థితుల్లో దిగి వచ్చిన అటవీశాఖ అధికారులు రోడ్డు నిర్మాణానికి అనుమతికి ఆమోదించారు. ఈ మేరకు అనుమతులు రావడంతో ఉపాధి నిధులతో అధికారులు మట్టిరోడ్డును ఏర్పాటు చేశారు.

కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చొరవతో..

కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేకంగా దీనిపై దృష్టి సారించారు. ఆయన హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్ కూడా మట్టిరోడ్డు నిర్మాణం వేగంగా పూర్తిచేశారు. ఇప్పుడు అంబులెన్స్ ఆ గ్రామాలకు చేరువలోకి వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. ఎవరికి అత్యవసరమైనా వెంటనే ఆస్పత్రికి చేర్చేందుకు రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. మర్రిపాకలో కూడా సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సమాచార వ్యవస్థ మెరుగుపడనుంది.

మట్టిరోడ్డుతో ఎంతో మేలు



ఇంత వరకు రహదారి లేకపోవడంతో ఏడు గ్రామాల గిరిజనులు చాలా అవస్థలు పడ్డారు. ఈ సమస్యపై కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి స్పందించారు. వారి చొరవతో ఉపాధి నిధులతో మట్టి రోడ్డు నిర్మించారు. దీనిపై సాధ్యమైనంత తొందరలో మెటల్ వేయాలని విన్నవించాం. అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎప్పటినుంచో ఆగిపోయిన రహదారి నిర్మాణం ఇప్పుడు పూర్తి కావడం ఎంతో ఆనందంగా ఉంది.

– దదాల రమేష్, సర్పంచ్, యు.చీడిపాలెం

బీటీ రోడ్డుకు ప్రతిపాదన

తొలుత మట్టిరోడ్డును ఏర్పాటుచేశాం. దీని తర్వాత జీఎస్ వేసి బీటీ వేసేందుకు ఆలోచన చేస్తున్నాం. దీనిలో కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ రహదారిలో వంతెనలు, కల్వర్టులు నిర్మించాల్సి ఉంది.వాటికి ప్రతిపాదించాం. ఈ మేరకు నిధులు మంజూరైతే త్వరితగతిన పనులు కూడా చేపడతాం. బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయితే తొమ్మిది గ్రామాల గిరిజనులకు అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయి.

– చాణక్య, ట్రైబల్ వెల్ఫేర్ డీఈ, చింతపల్లి

త్వరితగతిన రహదారుల నిర్మాణం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం పనుల ద్వారా ఏడు మండలాల్లో మారుమూల గ్రామాలకు మంజూరైన రహదారుల నిర్మాణం సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఒకొక్క మండలంలో బీటీ, సీసీ, మెటల్ రోడ్ల పురోగతి తెలుసుకున్నారు. పనులు ప్రారంభించి మధ్యలో మానేసిన కాంట్రాక్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఫారెస్ట్ క్లియరెన్సు వచ్చిన, రావాల్సిన రోడ్ల వివరాలు తెలుసుకున్నారు. మంజూరైన రహదారులను గడువులోగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

విద్యుత్ పునరుద్ధరణకు 'సీఆర్‌పీఎఫ్' సహకారం

సిబ్బందికి స్థానికుల అభినందన

వై.రామవరం: స్థానిక పోలీసుస్టేషన్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల చొరవతో వై.రామవరం గ్రామానికి విద్యుత్ సరఫరా మెరుగుపడింది. మూడు రోజుల క్రితం మండలంలో సంభవించిన గాలివానకు వై.రామవరం గ్రామ శివారులో చెట్లు విద్యుత్ తీగలపై విరిగిపడటంతో గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగి తీగలు తెగి పడటంతో మూడు రోజులుగా వై.రామవరం గ్రామంలో అంధకారం నెలకొంది. దీంతో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్విరామంగా పనిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు మూడు రోజుల సమయం పట్టింది. ఎట్టకేలకు శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ మరమ్మతు పనులకు గాను సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎంఎల్ నాయుడు ఆధ్వర్యంలో పది మంది సిబ్బంది విద్యుత్ శాఖ సిబ్బందికి సహాయ సహకారం అందించారు. వారిని స్థానికులు అభినందించారు.

లక్ష్మీపురం వలంటీర్ సుమిత్రకు అభినందన

కేజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కీర్తినందన్‌కు పింఛను అందిస్తున్న వలంటీర్ సుమిత్ర

అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం గ్రామ వలంటీర్ నందుల సుమిత్రను పలువురు అభినందించారు. ఇదే గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు కీర్తినందన్ సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతూ విశాఖ నగరంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేల పింఛనును గ్రామ వలంటీర్ 90 కిలోమీటర్ల దూరంలోని కేజీహెచ్‌కు శనివారం వెళ్లి బాలుడు కీర్తినందన్‌కు పంపిణీచేసింది. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేసిన ఆమె పలువురి నుంచి అభినందనలు అందుకుంది.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఉపాధి కల్పన జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్



స్కిల్ కళాశాల విద్యార్థులతో ప్రశాంత్‌కుమార్

అరకులోయ రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని ఉపాధి కల్పన జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జి20 కార్యక్రమంలో శనివారం స్థానిక స్కిల్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి కల్పన జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత తోనే ఆరోగ్యం సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల ఒకటి నుంచి 15 వరకు వివిధ రకాల కార్యక్రమాలతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేఆర్‌పీ శ్యామ్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో దొంగతనాలు

రెండు చోట్ల చోరీ



తాళాలు పగులగొట్టిన బీరువా



కిరాణా షాపులో తొలగించిన పైకప్పు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి రెండు చోట్ల దొంగతనాలు జరిగాయి. కొంచాడ రమేష్ చెందిన కిరాణా షాపు పైకప్పునకు రంధ్రం చేసి, రూ.లక్ష విలువైన ఫోన్లు, రూ.40 విలువైన సిగరెట్ బండిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. అదేరాత్రి హోలీగ్రాండ్ చర్చి సమీపంలోని పాస్టరమ్మ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆమె లేని సమయంలో బీరువా తాళాలు పగులగొట్టి, రూ.42వేల నగదు, బంగారు ఉంగారం, యాపిల్ ఫోన్ పట్టుకుపోయారు. దీనిపై ఇరువురు బాధితులు పోలీసులు సమాచారం అందించారు. ఎస్ఐ రవీంద్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణతో మంచి ఫలితాలు

- ● కలెక్టర్ సుమిత్‌కుమార్
- ● రూ.3.85 కోట్లతో యాంత్రీకరణ
- ● 212 యంత్ర పరికరాలకు రూ.1.40 కోట్ల సబ్సిడీ



రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ,ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు

సాక్షి, పాడేరు : వ్యవసాయ యాంత్రీకరణను గిరి రైతులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. స్థానిక కాఫీ అతిథి గృహంలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 197 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని గిరి రైతులు లబ్ధి పొందాలని సూచించారు. ప్రతీ రైతు భరోసా కేంద్రంలో ఒక కమ్యూనిటీ హైరింగ్ కేంద్రం ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. నలుగురైదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రాయితీపై కొనుగోలు చేసి తోటి రైతులకు అద్దెకు ఇచ్చి అధిక వ్యవసాయ దిగుబడుగులకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో వ్యవసాయం జరుగుతోందన్నారు. రైతులు రొటేషన్ పద్ధతిలో యంత్ర పరికరాలు ఉపయోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా అధిక దిగుబడులు సాధ్యమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో రూ.3.85 కోట్లతో 212 యంత్ర పరికరాలను పంపిణీ చేస్తున్నామని వీటికి రూ.1.40 కోట్ల మేర ప్రభుత్వం రాయితీ అందిస్తోందన్నారు.

ఆధునిక వ్యవసాయం అలవర్చుకోవాలి: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గిరిజన రైతులంతా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఉన్నాయన్నారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న పరిస్థితుల్లో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. మొదటి దశలో 29 ట్రాక్టర్లు పంపిణీ చేయగా, ప్రస్తుతం రెండో దశలో మరో 32 ట్రాక్టర్లు అందజేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ సహకారం సద్వినియోగం : ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. మైదాన ప్రాంతాలకు దీటుగా గిరిజన రైతులు కూడా వ్యవసాయ యాంత్రీకరణతో లబ్ధి పొంది మంచి ఫలితాలు సాధించాలన్నారు.

చెక్కుల పంపిణీ

వ్యవసాయ యాంత్రీకరణ రుణాల చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యేలు రైతులకు పంపిణీ చేశారు. కలెక్టర్, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు ట్రాక్టర్లను నడిపి సందడి చేశారు. 32 ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలో ట్రాక్టర్ల ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం. సరస్వతి, సభ్యుడు ఎం. కన్నాపాత్రుడు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి నందు, జీకే వీధి జెడ్పీటీసీ కిముడు శివరత్నం, పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, డీసీసీబీ సీఈవో వర్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకే రామసత్యవతి పాల్గొన్నారు.







ట్రాక్టర్ నడుపుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా లక్ష్మి

బాధ్యతల స్వీకరణ

రంపచోడవరం : స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ లక్ష్మి నియమితులయ్యారు. శనివారం బాధ్యతలు చేపట్టిన ఆమె ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం భన్సల్‌ను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు డాక్టర్ సుధాకర్, వాసు, ఆస్పత్రి డైరెక్టర్ మంగ కుమార్ అభినందనలు తెలిపారు.

నాటు సారా ధ్వంసం

జి.మాడుగుల: నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలకు గిరిజన ప్రజలు దూరంగా ఉండాలని పాడేరు ఏఎస్పీ కె. ధీరజ్ ఆదేశించారు. మండలంలో 2022లో నమోదైన కేసులో స్వాధీనం చేసుకున్న 55 లీటర్ల నాటు సారాను శనివారం ఆయన ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది ధ్వంసం చేశారు. పాలమామిడి సర్పంచ్ సురభంగి రామకృష్ణ, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, సొలభం మాజీ సర్పంచ్ రమణ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

నాడు-నేడు పనుల పరిశీలన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

ముంచంగిపుట్టు: జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు రెండో విడతలో నిర్మాణం జరుగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల పనులను వేగవంతం చేయాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి అన్నారు. మండలంలోని రంగబయలు పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించి, పనులను పరిశీలించారు. మండలంలోని 12 గ్రామాల్లో నాడు-నేడు కింద భవనాలు మంజూరైయ్యాయని, ఒక్కో భవనానికి రూ.16 లక్షలతో నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

నవజాత శిశువులకు మెరుగైన సేవలు

నవజాత శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలోని పాత భవనంలో రూ.6.50లక్షలతో ఆధునీకరించిన నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, తదితరులతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి శిశువులకు, చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ చిన్న పిల్లలకు ప్రత్యేకంగా ఐసీయూ ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో శిశు మరణాలు జరగకుండా తగిన విధంగా మెరుగైన వైద్యం అందించాలన్నారు. పిల్లలకు అవసరమైన ఔషధ నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలనని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నిరంతరం వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రి రెండో అంతస్తులో మరో 30 పడకలతో అదనపు వార్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని, నిర్మాణం కోసం భవనం సామర్థ్యాన్ని పరిశీలించాలని ఆదేశించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రత్యేకంగా గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రమైన పాడేరులో మెడికల్ కళాశాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. జిల్లా ఆస్పత్రిలో అందుతున్న అన్ని రకాల వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రాష్ట్ర మెడికల్ కౌన్సెల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. కృష్ణారావు, పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం.సరస్వతి, ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ



వేంపాడులో రామానుజుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చినజీయర్‌స్వామి

అనకాపల్లి టౌన్: రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం ఆధ్యాత్మిక శోభ తాండవించింది. మహాలక్ష్మీసమేత వైకుంఠనారాయణ, వేంకటేశ్వర, లక్ష్మీనారాయణ విగ్రహ ప్రతిష్ఠాపన వైభవోపేతంగా జరిగింది. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి హాజరు కావడంతో భక్తులు పరవశించిపోయారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య చినజీయర్‌స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన నేత్రపర్వంగా జరిగింది. ధ్వజస్తంభాన్ని కూడా ప్రతిష్ఠించి, స్వామీజీ ఆలయ ఆవరణలో పాలూరు సూర్యప్రకాష్ ఫంక్షన్ హాలును ప్రారంభించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్వామివారి ఆశీస్సులు పొందారు. స్వామిజీ ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావును బంగారు కంకణంతో సత్కరించారు. విగ్రహాల శిల్పులు పరమేష్, గోపీ, రమేష్, ఎంపీపీ సూరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు రామకోటేశ్వరరావు, రామకృష్ణప్రసాద్, నర్సింగరావు, వెంకటరమణ, చిరంజీవి, రామకోటి, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణస్వామి

ప్రత్యక్ష నారాయణుడైన సూర్య భగవానుడు ఆరోగ్య ప్రదాత అని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సూర్యదేవుడి విశిష్టతను వివరించారు. స్వామివారి తల్లిదండ్రులు కశ్యప ప్రజాపతి, అదితి. అదితి సంతానమంతా దేవతలే. అయితే ఆమెకు సూర్యనారాయణుడంటేనే ప్రీతి. అందుకే ఆయనకు ఆదిత్యుడన్న పేరు వచ్చింది. సమస్త జీవులను కార్యకలాపాలవైపు మళ్లించే శక్తి ఒక్క సూర్యనారాయణస్వామికి మాత్రమే ఉంది. ఏ పూజ చేసినా... ఏ నోము నోచినా సూర్యనారాయణస్వామి వంక చూస్తూ చేస్తే పుణ్యం లభిస్తుందన్నారు.

భగవంతుడి దృష్టిలో మనుషులంతా ఒక్కటే

నక్కపల్లి: భగవంతుడి దృష్టిలో మనుషులంతా ఒక్కటేనని, చిన్న పెద్ద, పొట్టి పొడుగు, తెలుపు, నలుపులను బట్టి తేడా ఉండదని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. శనివారం ఆయన వేంపాడులో వికాసతరంగిణి ఏర్పాటు చేసిన భగవద్ రామానుజుల వారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. రామానుజుల వారంటే సమతా మూర్తి అన్నారు. వారి దృష్టిలో అందరూ సమానం కావడంతో అలా పిలుచుకుంటున్నామన్నారు. భగవంతుడి దృష్టిలో కోటీశ్వరుడు, పేదవాడు ఒక్కటేనన్నారు. ఈ విషయాన్ని ప్రపంచమానవాళికి చాటి చెప్పిన రామానుజుల వారి విగ్రహాన్ని వేంపాడులో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషదాయకమన్నారు. డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, సురేష్‌రాజు, అప్పలరాజు, చినపేర్రాజు, ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం మెరుగుకు ప్రాధాన్యం



సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏడీసీ ప్రొగ్రాం సమన్వయకర్త నారాయణరెడ్డి

చింతపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ప్రతిభ పరిశీలించేందుకు నీతి అయోగ్ సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా (ఏడీసీ) ఏస్పిరేషనల్ డిస్ట్రిక్స్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టిందని అల్లూరి జిల్లా పోగ్రాం సమన్వయకర్త జి.నారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులతో ఈ కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సామర్థ్యం మెరుగుకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. నీతి అయోగ్ సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం ద్వారా దేశ వ్యాప్తంగా 780 జిల్లాల్లో ఈ కార్యక్రమం అమలవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అల్లూరి జిల్లాలో చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు మండలాలను ఎంపిక చేయగా, చింతపల్లిలో 34 పాఠశాలలను గుర్తించామన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థుల వివరాలు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. యాప్ నిర్వాహణ, విద్యార్థుల నమోదు ప్రక్రియ వంటి అంశాలపై చర్చించారు. ఎంఈవో ప్రసాద్ తదితరులున్నారు.

నిలిచిన కంటైనర్: స్తంభించిన ట్రాఫిక్



కొదంగూడ వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిచిన కంటైనర్

అనంతగిరి: మండలంలోని అరకు-విశాఖ ప్రధాన రహదారి కొదంగూడ గ్రామ సమీపంలోని మలుపు వద్ద కంటైనర్ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. చత్తీస్‌గఢ్‌కు చెందిన భారీ కంటైనర్ అనంతగిరి మీదుగా మైదాన ప్రాంతానికి శనివారం ఉదయం వెళ్తుండగా, కొదంగూడ మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కకు దిగిపోవడంతో ఒరిగిపోయింది. మలుపు కావడంతో పెద్ద వాహనాలు సైతం వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. అర కిలోమీటరు మేర వాహనాలు సుమారు గంటపాటు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. కార్లు, ద్విచక్రవాహనాలు మాత్రమే రాకపోకలు సాగాయి. తరువాత కంటైనర్ అతికష్టంగా ముందుకు నడపడంతో రాకపోకలు సాగాయి. అనంతగిరి-శివలింగపురం మార్గంలో రహదారి కోతకు గురవడంతో తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

20 మంది జెన్‌కో ఇంజినీర్లకు బదిలీ

మోతుగూడెం: సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో విధులు నిర్వహిస్తున్న 20 మంది ఇంజనీర్లను బదిలీలు చేస్తూ ఏపీ జెన్‌కో ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం మోతుగూడెం ముఖ్య కార్యాలయానికి ఆదేశాలు అందాయి. జలవిద్యుత్ కేంద్రంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణను పోలవరం ప్రాజెక్టుకు బదిలీ చేశారు. విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మరో నలుగురిని విజయవాడ బదిలీ చేశారు. సివిల్ సెక్షన్లో ఏఈఈ సురేష్, డిస్ట్రిబ్యూషన్‌లో ఏఈఈ కిరణ్, అకౌంట్స్ ఆఫీసర్ రెడ్డి విజయవాడకు బదిలీ అయ్యారు. ఐదేళ్లు విధులు నిర్వహించిన వారికి బదిలీ అవకాశం కల్పించినట్టు జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.